కనీస వేతనాల సలహా మండలి
సభ్యుడిగా శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్,డిసెంబర్13: తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా కొత్త పల్లి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్ హోటల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ మేరకు కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో రెండేండ్ల పాటు ఆయన కొనసాగనున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్,డిసెంబర్13: రాష్ట్రంలోని సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారిని క్రమబద్ధీకరణ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తాము అధికారంలోకి వచ్చిన తరువాత పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించడం శోచనీయమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మండల,జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్,టెక్నికల్ పర్సన్స్,ఆపరేటర్లు, డేటా ఎంట్రీ,క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, స్పెషల్ ఆఫీసర్స్ వంటి విభాగాల్లో వేలాది మంది పనిచేస్తున్నారని తెలిపారు.ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

2010 లోపు పుట్టిన పిల్లల పేర్లను నమోదు చేసుకోండి

అంబర్‌పేట : 2010 సంవత్సరం లోపు పుట్టిన పిల్లల పేర్లను ఇప్పటి వరకు ఎవరైతే జీహెచ్ఎంసీ రికార్డుల్లో నమోదు చేయించలేదో వారంతా డిసెంబర్ 31 లోపు పిల్లల పేర్లను బర్త్ అండ్ డెత్ సెక్షన్‌లో నమోదు చేయించాలని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ రిజిస్ట్రార్ డా.హేమలత తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. డిసెంబర్ 31లోపు పిల్లల పేర్లను నమోదు చేయకపోతే ఇక ముందు నమోదు చేసుకునే అవకాశం లేదన్నారు.

అడుగడుగున.. గుంతలు

గుంతల మయంగా మారిన కిస్మత్‌పూర్- బండ్లగూడ రోడ్డు పట్టించుకోని అధికారులు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు హెచ్ఎండీఏ రోడ్ల ప్రణాళికలు శాపంగా మారాయి. హెచ్ఎండీఏ వారు రోడ్లు వేస్తున్నారు.. మాకేంటి అని కార్పొరేషన్ అధికారులు గాలికి వదిలేశారు. హెచ్ఎండీఏ రోడ్లు వేసేదెన్నడో కాని ఆ రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో వాహన దారులకు ఆ రోడ్డు గుండా ప్రయా ణం చేయాలంటే నిత్యం నరకయాతన పడుతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తా నుంచి కిస్మత్‌పూర్‌కు వెళ్లే దారి అడుగడుగున గుంతల మయంగా మారింది.ఈ దారి గుండా నిత్యం అనేక వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు.కాగా రోడ్డు అంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.దీంతో ట్రాఫిక్ భారీ స్థాయిలో జామ్ అవుతుండడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు.ఈ విషయం ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుపోతే ఇది అదిగో అంటు దాట వేస్తున్నారు.

- బండ్లగూడ, డిసెంబర్ 13 :

నిత్యం ట్రాఫిక్ జామ్..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా అనేక కాలనీలు వెలిశాయి.దీంతో వాహనాల రద్దీ బాగా పెరిగిపోయింది.కిస్మత్ పూర్ నుంచి బండ్లగూడ వరకు ఉన్న రోడ్డు సైతం గుంతల మయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.రోడ్డుపై గుంతలు ఉండడంతో వాహనాల రాకపోకలు నిధానంగా వెళ్తున్నాయి.దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో ప్యాచ్ వర్కులు చేపడుతాం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ కూడలి వరకు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారిందని తమ దృష్టికి వచ్చింది.వెంటనే ఆ రోడ్డుకు ప్యాచ్ వర్కు పనులు చేపడుతామన్నారు. - శరత్‌చంద్ర, కమిషనర్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తొండుపల్లి గ్రామంలో ఫిరంగి నాలా పరిశుభ్రం పనులను ప్రారంభిస్తున్న పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 13 : ఫిరంగి నాలను పరిశుభ్రంగా తయారు చేస్తానని కౌన్సిలర్ ప్రతినిధి పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లి గ్రా మం 11వ వార్డులో ఇండ్లమధ్యలో నుంచి పురాతన ఫీరంగి నాలా ఉంది. అయితే నాలా పూర్తిగా అపరిశుభ్రంగా మారడంతో రాత్రి వేళలో దోమలు, ఈగలతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్ దంపతులు వారి సొంత నిధులతో గ్రామంలోని ఫిరంగి నాలాను పరిశుభ్రం చేసే పనులను శుక్రవారం ప్రారంభించారు. నాలాను పరిశుభ్రం చేయడంతో పాటు ముగురునీరు చేరకుండా చర్యలు తీసుకుంటానని వివరించారు. కార్యక్రమంలో కొండ పరమేష్‌గౌడ్, రాచమల్ల సురేష్,దొడ్డ పెంటయ్య, కొండ దర్శన్‌గౌడ్, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి .. హేయమైన చర్య



ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హైదర్ ఉన్నీసాను కలిసి ఫిర్యాదు చేస్తున్న రాజేంద్రనగర్ మీడియా ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 13: జర్నలిస్టుపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబుపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజక వర్గ మీడియా ప్రతినిధులు డిమాం డ్ చేశారు. జల్‌పల్లి ఫామ్ హౌస్ వద్ద సినీ నటుడు మోహన్‌బాబు జర్నలిస్టు రంజిత్‌పై చేసిన దాడిని నిరసిస్తూ హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 143 వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హైదర్ ఉన్నీసాను కలిసి మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలని, గాయపడ్డ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ..అందరి బాధ్యత

పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఆవరణలో శుక్రవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్, హెచ్ అండ్ ఆర్ బ్లాక్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 700 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా.ఎల్వీకే.రెడ్డితో పాటు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. - బంజారాహిల్స్,డిసెంబర్ 13

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న డీసీపీ బాలస్వామి

హిమాయత్‌నగర్, డిసెంబర్13: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి,నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ డైరెక్టర్ మణికొండ ప్రార్థన, రంజీ ట్రోఫీ క్రీడాకారుడు సాకేత్ సాయి రామ్ అన్నారు.శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో 44వ వార్షిక క్రీడోత్సవాలు ముగిశాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు విద్యార్థులకు సూచించారు.అనంతరం క్రీడలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధి వెంకట్ రావు,స్కూల్ కరస్పాండెం ట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణ కమిటీ నియామకం

చిక్కడపల్లి,డిసెంబర్ 13: వివేక్ నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటైంది. ఆలయానికి నూతన రెనోవేషన్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులను జారీ చేశారు. మొత్తం 18 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, దేవాలయం కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం సమక్షంలో కమిటీ చైర్మన్‌గా జానకీ సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో సమావేశంలో సభ్యులు జి.పద్మవతి, నిర్మల, ముక్క రామకృష్ణ, శ్యామ్ కుమార్, సరళా నీతారాణి, ఎం.లక్ష్మీనారాయణ, సుబ్బారావు, బాలకుమార్, నవీన్‌ప్రసాద్, వెంకట శేషుకుమార్, హరీశ్, ప్రతాప్‌కుమార్, వెంకటరావులతోపాటు పలువురు నియమితులయ్యారు.

బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కృషి చేయాలి

కాచిగూడ,డిసెంబర్ 13: చట్టసభల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి తెలంగాణ శాసనసభ ఏకగ్రీవ తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని జాతీ య బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. శుక్రవారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం బీసీల పట్ల అనుసరిస్తున్న విధానం సరైంది కాదన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కిర్రాక్ ఆర్పీ

ఖైరతాబాద్, డిసెంబర్ 13 : దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఆధ్యుడు స్వాతంత్ర్య సమరయోధులు పొట్టి శ్రీరాములు అని జబర్దస్ నటుడు కిర్రాక్ ఆర్పీ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చరిత్ర మరిచిపోదన్నారు. ఆయన ఆమరణ దీక్ష తర్వాత ఆంధ్ర ప్రదేశతో పాటు మహారాష్ట్ర, ఒడిషా, పశ్చిమ బెంగాల్, కర్నాటక, కేరళ, తమిళనాడు భాషాప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పాడ్డాయన్నారు. ఈ నెల 15న ఆయన వర్ధంతిని తెలుగు రాష్ట్రాల ప్రజలు జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పొట్టి శ్రీరాములు మనుమరాలు ప్రొఫెసర్ రేవతి, అనురాధ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 13 : టీఎస్ యూటీఎఫ్ 6వ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని శంషాబాద్ మండల టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు దార బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 14,15 తేదీల్లో రంగారెడ్డి జిల్లా 6వ మహాసభలు షాద్‌నగర్‌లోని ఠాగూరు ఆడిటోరియంలో జరుగుతున్నాయని వివరించారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడంపై చర్చిస్తామన్నారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి,, ప్రొఫెసర్ నాగేశ్వర్‌లు పాల్గొంటారన్నారు. శంషాబాద్ మండలంతో పాటు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

కాచిగూడ,డిసెంబర్ 13: తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణశర్మ రచించిన 'అనంత కవితా లహరి' పుస్తకావిష్కరణ ఈ నెల 15 ఆదివారం ఉదయం 9 గంటలకు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకుడు బడేసాబ్ తెలిపారు.

తనిఖీలు:పాత సరఫరాల వినియోగదారులకు రేషన్ దుకాణాలలో సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో చౌకధరల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్టాక్, రిజిస్టర్‌లను పరిశీలించారు.

వినతిపత్రం అందజేత: తాగునీటి, సీవరేజీ సమస్యలు లేకుండా చూడాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీవరేజీ సమస్యలపై జలమండలి జీఎం హరిశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

(జూబ్లీహిల్స్,డిసెంబర్13)

పీజీ డిప్లామా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్షలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లామా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఈ కోర్సుల మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ అకారులు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెల లోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఈ కోర్సు వివిధ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఓయూ పరిధిలోని అన్ని బీఈ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లిమెంటరీ పరీక్షా ఫీజును ఈనెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

గోల్నాక, డిసెంబర్ 13 : నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం అంబర్ పేట డివిజన్ మున్సిపల్ కాలనీలో రూ.17లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు మరమ్మతు పనులను కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నియోజవకర్గ వ్యాప్తంగా కొత్తగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీంతో పాటు మంచినీటి, డ్రైనేజీ, పార్కుల సుందరీకరణ, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు వంటి పనులు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా స్థానికులను వేధిస్తున్న డ్రైనేజీ, మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. డీఈ ప్రశాంతి, ఏఈ శ్రీగంధ్‌తో పాటు బస్తీవాసులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

అంబర్‌పేట : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శాంతినగర్, చర్చిలేన్, చెంచు బస్తీలలో డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం పర్యటించారు. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా బస్తీలో ఏడాది పొడవునా డ్రైనేజీ పొంగిపొర్లుతుండటాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న వాటర్‌వర్క్స్ మేనేజర్ మాజిద్‌కు చెప్పి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అలాగే బస్తీలో చెత్త తరలించే ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారని బస్తీవాసులు పేర్కొనగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం బస్తీలో తన సహకారంతో నిర్మిస్తున్న గుడిని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ చంద్రమోహన్, టి.రమేశ్, మిర్యాల శ్రీనివాస్, కెంచె మహేశ్, శ్రీహరి, డి.లక్ష్మణ్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాజానికి అవసరమయ్యే పరిశోధనల అవసరం ప్రస్తుత కాలంలో ఎంతగానో ఉందని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ జియోఫిజిక్స్ విభాగంలో 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. జియోఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్, ఏఈజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

యువతి అదృశ్యం

శ్రావణి (ఫైల్)

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 13 : యువతి అదృశ్యమైన ఘటన శుక్రవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి చెందిన బండారి శారద పెద్ద కూతురు శ్రావణి(19) గురువారం రాత్రి 7 గంటల సమయంలో కిరాణాషాపునకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన ఆమె ఎంతకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా ఫలితం దక్కలేదు. అదే గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడిపైనే అనుమానం ఉన్నట్లు తల్లి శారద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

మల్లమ్మ(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 13: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు కనిపించకుండాపోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ శాంతినగర్‌లో నివాసం ఉండే ప్రభావతి తన తల్లి మల్లమ్మ(70)ను బీదర్ నుంచి తన ఇంటికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చింది. మల్లమ్మకు కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో నగరంలో చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం మల్లమ్మ బయటకు వెళ్లింది. ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని సంరక్షించాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలను వర్సిటీలే చేపట్టాలని అన్నారు. వర్సిటీలలో ఎన్నో ఏళ్లుగా అధ్యాపక భర్తీ చేయకపోవడంతో ఖాళీల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఇంకా జాప్యం చేస్తే వర్సిటీల్లో నాణ్యమైన ఉన్నత విద్య అందించే అవకాశం ఉండదన్నారు.